## క్లుప్తంగా

### ఘనంగా ముగిసిన తిరునాల


ప్రత్యేక ఆకర్షణగా చాందినీ బండి

**సుండుపల్లె :** మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లె, ఎల్లారెడ్డిగారిపల్లెలలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి తిరునాల(జాతర) ఆదివారం ఉదయంతో ఘనంగా ముగిశాయి. తిరునాల ఉత్సవాలలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు అభిషేకంలో నిర్వహించి రాత్రి ఆశాది వారిచే ఎల్లమ్మ హరికథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ, మేళతాళాలు డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా కాలుస్తూ చాందినీబండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆదివారం ఉదయం భక్తులు తమ మొక్కుబడులలో భాగంగా బోనాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరునాల మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### నేడు మండల సమావేశం

**వీరబల్లి :** మండల సర్వసభ్య సమావేశం నేడు సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటలకు ఈ సమావేశంలో మండలంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, వివిధ శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందని తెలియజేశారు.

### పరీక్షా సామగ్రి వితరణ

**రాయచోటి టౌన్ :** పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలోని 10వ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లను బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పద్మాయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువే ఆస్తిగా భావించి క్రమశిక్షణ, శ్రద్ధతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ యాదవ్, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బాబు, దాత టి.గంగయ్య యాదవ్, ప్రిన్సిపల్ జీవి రమణ, ఉపాధ్యాయులు సంకా రామయ్య, మల్లికార్జున, జయరాం, పి.వెంకటరణ యాదవ్, నాగేశ్వర, శరత్‌కుమార్, వీవై శివయ్య, వార్డెన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

**రాయచోటి టౌన్ :** పీఆర్‌సీ బకాయిలు, డీఏ అరియర్స్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర సంఘం కార్యదర్శి పీసీ రెడ్డెన్న డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి ఎన్‌జీఓ హోంలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బి.వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, డీఏ అరియర్స్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ వైద్య సౌకర్య పరిమితిని రూ.5లక్షలకు పెంచాలని కోరారు. అలాగే 12వ పీఆర్‌సీని కూడా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అపోలో హాస్పిటల్ పీఆర్‌ఓ కమ్రుద్దీన్ ఆరోగ్య సమస్యలపై వారికి వివరించి చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ట్రెజరర్ జయచంద్రారెడ్డి, గుడిబండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహం ఉప్పొంగేలా.. ఉర్రూతలూగేలా


మ్యాచ్‌ను తిలకిస్తున్న క్రికెట్ అభిమానులు

**నందలూరు :** ఐసీసీ ఛాంపియన్స్ క్రికెట్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయ్‌లో జరుగుతున్న భారత్, న్యూజిలాండ్‌ల మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు తిలకించేందుకు అరవపల్లిలోని ఆర్‌అండ్‌బీ వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ స్క్రీన్‌ను సర్పంచ్ జంబు సూర్యనారాయణ, అరిగె మణి, అరిగె హరిబాబు, మోడపోతుల రాము, ఉప్పుశెట్టి సుధీర్ సహకారంతో బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య ఏర్పాటు చేయించారు. సాయంత్రం విశ్రాంత రైల్వే మెడికల్ ఆఫీసర్ బచ్చు జయభాస్కర్ రావు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. అభిమానులు ఉత్సాహంగా కేరింతలు, చప్పట్లతో మ్యాచ్‌ను తిలకించారు. వికెట్ పడిన ప్రతిసారి చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఉరకలు వేస్తూ తమ ఆనందాన్ని తెలియజేశారు. స్క్రీన్ ఏర్పాటు చేసిన వారికి క్రీడా అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు.

### లారీ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

**పుల్లంపేట :** కడప–చెన్నై జాతీయ రహదారి పుత్తనవారిపల్లి చెక్‌పోస్టు వద్ద ఆకుల లోడుతో ఉన్న లారీ పైకి ఎక్కుతూ కాలుజారి కిందపడటంతో వెనుకవైపు వస్తున్న లారీ వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఓబులవారిపల్లి మండలం అయ్యలరాజుపల్లి హరిజనవాడకు చెందిన గౌరీ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని అంబులెన్సు ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆకట్టుకునేలా.. ఆరోగ్యాన్ని పెంచేలా!

- మార్కెట్‌లో కుండలకు పెరుగుతున్న గిరాకీ
- కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు
- చూపరులను ఆకర్షిస్తున్న వివిధ డిజైన్‌లు


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

**రాజంపేట టౌన్ :** మార్చి ఆరంభం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో ప్రజలు భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు తగు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ప్రజలు చల్లటినీళ్లు తాగి సేదతీరాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే ప్రధానంగా వేసవిలో శరీరం డిహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. అందువల్ల వేసవిలో రోజుకు కనీసం ఐదు లీటర్ల నీటిని అయినా తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కువ శాతం మంది ప్రజలు ఆరోగ్య చిట్కాలను పాటిస్తున్నారు. అందువల్ల ఫ్రిజ్‌తో చల్లబడిన నీళ్లు తాగడం అంతమంచిది కాకపోవడంతో ఇప్పుడు ధనవంతులు సైతం మట్టి కుండలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో కుండల విక్రయాలు జోరుగా సాగుతుంది. కుండలు కొనుగోలు చేస్తున్న వారిలో విద్యావంతులు, ధనవంతులు ఎక్కువ మంది ఉండటం విశేషం.

**ఆకట్టుకునే డిజైన్‌లలో..**

ధనవంతులు ఇంటిని నిర్మించుకునేటప్పుడు ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా వారి అభిరుచి మేరకు ఇంటిని నిర్మించుకుంటున్నారు. అలాగే ఇంటిలో కనిపించే ప్రతి వస్తువు ఆకట్టుకునేలా ఉండేలా చూసుకుంటున్నారు. అందువల్ల కుండల విక్రయదారులు సైతం ప్రజల అభిరుచి మేరకు మట్టికుండలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఉప్పుబానల (నల్లకుండలు) తోపాటు సాధారణ మట్టికుండలు అందుబాటులో ఉన్నాయి. ఇక అత్యాధునిక హంగులతో భవనాలు నిర్మించుకున్న వారి కోసం చూపరులను కట్టిపడేసే డిజైన్‌లలో మట్టికుండలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. మట్టికుండలే కాక మట్టితో తయారు చేసిన వాటర్ బాటిల్స్, గ్లాసులతోపాటు దినసరి కూలీలు తమవెంట తీసుకువెళ్లడానికి వీలుగా ఉండే మట్టి కూజాలను కూడా వ్యాపారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. పేద ప్రజల కోసం ఎలాంటి డిజైన్‌లు లేని కుండలు, వాటర్ బాటిల్స్‌లు తక్కువ ధరకు లభిస్తుండగా, కనువిందుచేసే డిజైన్‌లలో ఉండే మట్టి కుండలు, వాటర్ బాటిల్స్ కాస్త ధర ఎక్కువగానే ఉన్నాయి.

**ఇతర రాష్ట్రాల నుంచి..**

ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న మట్టికుండలు, గ్లాసులు, బాటిల్స్ తెలంగాణ, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి తెప్పించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సైజు, డిజైన్‌లను బట్టి ఒక్కో కుండ రూ.250 నుంచి రూ.750లు వరకు ధర పలుకుతోంది. ఇక మట్టిగ్లాసు రూ.60లకు విక్రయిస్తుండగా మట్టి వాటర్ బాటిల్స్ ధర రూ.250లుగా ఉంది. అలాగే ఎలాంటి డిజైన్ లేని కుండ సైజును బట్టి రూ.250 నుంచి ఐదు వందల వరకు ఉంది. డిజైన్‌తో తయారు చేసిన కుండలు సైజును బట్టి 350 నుంచి 750 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.


వివిధ డిజైన్‌లలో మట్టికుండలు

**ఫ్రిజ్ వాటర్‌తో ఆరోగ్య సమస్యలు**



ఇప్పుడు చాలా మంది ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉంటున్నాయి. అందువల్ల వేసవిలో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఫ్రిజ్ వాటర్‌ను తాగుతుంటారు. ఫ్రిజ్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల గొంతునొప్పి, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల ఫ్రిజ్ వాటర్‌కు దూరంగా ఉండటమే మంచిది. వేసవిలో చల్లటి నీళ్లు తాగకకుంటే దాహం తీరదు. అందువల్ల మట్టికుండలో నీటిని తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది.

– డాక్టర్ అశ్విన్, ఆకేపాడు పీహెచ్‌సీ, రాజంపేట మండలం

**చాలా రిలాక్స్‌గా ఉంటుంది**



వేసవి కాలంలో కాస్త బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగాలని పిస్తుంది. అయితే ఫ్రిజ్‌లో నీళ్లను తాగడం కంటే మట్టి కుండలో నీటిని తాగితే చాలా రిలాక్స్‌గా ఉంటుంది. ఫ్రిజ్‌లో నీటిని కొన్ని తాగేసరికి దాహం తీరినట్లు ఉంటుంది. అయితే మళ్లీ దాహంగా అనిపిస్తుంది. అదే మట్టికుండలో నీటిని తాగితే సంపూర్ణంగా దాహం తీరినట్లు అనిపిస్తుంది.

– మేడా చెంగల్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ, రాజంపేట

**కార్లల్లో వచ్చి కొనుక్కుంటున్నారు**



ఈనెల ప్రారంభమైనప్పటి నుంచి ఎక్కువ మంది మట్టికుండలను కొనుక్కుపోతున్నారు. కొంత మంది కార్లల్లో వచ్చి కూడా కొంటున్నారు. పేదోళ్లు తక్కువ ధరకు ఉండే కుండలు, బాగా డబ్బున్న వాళ్లు డిజైన్‌లలో ఉండే కుండలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. చాలామంది వాటర్ బాటిల్స్‌ను కొనుగోలు చేసేందుకు మందుకు వస్తున్నారు.

– లక్ష్మీదేవి, కుండల వ్యాపారి, రాజంపేట

# రసవత్తరంగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

**ఒంటిమిట్ట :** మండల పరిధిలోని మలకాటిపల్లి సమీపంలో కొలువైన వీర గంగమ్మ తిరునాలలో భాగంగా మూడవరోజు బండలాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వీర గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పోటీలలో కడప జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన ద్వారశాల గురువు రెడ్డి కాడెలు 1240 అడుగులు బండను లాగి రూ. 60 వేలు మొదటి బహుమతిని గెలుచుకున్నాయి. ఈ బహుమతిని పాటూరు సుబ్బారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ద్వితీయ బహుమతి కడప జిల్లా కమలాపురానికి చెందిన తోట కుమారి కాడెలు 900 అడుగులు లాగి రూ. 40 వేలు బహుమతిని ఆలయ కమిటీ సభ్యులు అందించారు. మూడవ బహుమతిని కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, రంగసాయి పల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దు 870 అడుగులు లాగి రూ.30 వేలు బహుమతిని కుమారి సుధాకర్ రెడ్డి అందజేశారు. నాల్గవ బహుమతి ప్రొద్దుటూరులోని పెన్నా నగర్‌కు చెందిన మహబూబ్ బాషా ఎద్దు అందుకోగా వారికి కుమారి ఎల్లారెడ్డి రూ. 20 వేలు బహుమతిని అందజేశారు. అనంతరం ఆలయంలో రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ నక్కల జయమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు 2 వేల లడ్డూలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు టక్కోలు శివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు మేకపాటి నందకిషోర్ రెడ్డి, తేలూరు శేషారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి, పాటూరు వెంకటసుబ్బారెడ్డి, పాటూరు గంగిరెడ్డి, చామ వెంకటశేషారెడ్డి, చామ వెంకటసుబ్బారెడ్డి, తిప్పన వెంకట సుబ్బారెడ్డి, కుమారి గంగిరెడ్డిలు పాల్గొన్నారు.

# సాంప్రదాయబద్ధంగా హోమ పూజలు


హోమ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

**సుండుపల్లె :** మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర స్వామి ఆలయ సమీపంలో వెలసి ఉన్న కాళికాదేవికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణులు రెడ్డయ్య ఆచారి, మోహనాచారి, కుమారాచారి వారి కుటుంబసభ్యులు నిర్మించిన కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు రెండు రోజులుగా నిర్వహించారు. ఉదయం వేదపండితులచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమంలో అమ్మవారి సాంప్రదాయబద్ధంగా పూజలు చేసి అమ్మవారికి శాంతి చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు.

# విద్యుత్ ఉద్యోగిపై కర్రతో దాడి

**ఓబులవారిపల్లె :** గొబ్బూరివారిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ చిన్న కాశయ్యపై శ్రీకాంత్ అనే వ్యక్తి కర్రతో దాడి చేశాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చిన్నంపల్లి హెల్పర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ ఎల్‌సీ అడుగగా ఆపరేటర్ చిన్న కాశయ్య విద్యుత్‌ను నిలిపివేశాడు. దీంతో చిన్నంపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి మద్యం మత్తులో విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న చిన్నకాశయ్యపై ఎందుకు విద్యుత్ నిలిపివేశారని గొడవ చేసి కర్రతో దాడి చేశాడు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారి కిరణ్, ఆపరేటర్ చిన్న కాశయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.మహేష్ తెలిపారు.

## పట్టణంలో 30 పోలీస్ యాక్ట్ అమలు

**రాజంపేట రూరల్ :** పట్టణ పరిధిలో 30 పోలీస్ యాక్ట్, 163 బీఎన్‌ఎస్‌ఎస్(144 సీఆర్ పీసీ)అమలులో ఉందని పట్టణ ఎస్‌ఐ వి.లక్ష్మిప్రసాద్‌రెడ్డి ఆదివారం తెలియజేశారు. పట్టణంలో ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతులు లేవన్నారు. ర్యాలీ, రాస్తారోకోలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు. అదే విధంగా నలుగురికి మించి గుమికూడి ఉండరాదన్నారు. ఈ నియమాలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రార్థనలు అయిపోయిన తరువాత ప్రార్థన స్థలాలను వదిలి వెళ్లాలన్నారు. ఎవరైనా తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తే అటువంటి వారిపైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

## యానాదుల అభివృద్ధికి చొరవ చూపాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**రాజంపేట రూరల్ :** రాష్ట్రంలో ఎస్టీలకు ప్రత్యేక వర్గీకరణ చట్టం ఏర్పాటు చేసి అమలు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లి బాలకృష్ణ అధ్యక్షతన ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ఎస్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 37 లక్షల గిరిజనులలో 10లక్షల మంది యానాదులు ఉన్నట్లు తెలియజేశారు. వీరు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఇప్పటికీ వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం యానాదుల బలోపేతంతోపాటు వారి అభివృద్ధికి చొరవ చూపాలని కోరారు. ఎస్టీల ప్రత్యేక చట్టం వర్గీకరణ సాధించేందుకు ఏప్రిల్ 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరీ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఎస్టీ వర్గీకరణ బేరీ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చేవూరి సుబ్బారావు, మహిళా అధ్యక్షురాలు ఉషా రవీంద్ర, జిల్లా అధ్యక్షులు నీలం సురేంద్ర, ప్రధాన కార్యదర్శి పులి శివశంకర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సేవాభావాన్ని పెంపొందించుకోవాలి


రాయచోటి అర్బన్: పరీక్ష సామగ్రి అందుకున్న విద్యార్థులతో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్


రామాపురం: వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

**రాయచోటి అర్బన్ :** ప్రతిఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ పీఎంజెఎఫ్ గవర్నర్ గౌతమ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోకి కొత్తపేట రామాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. మదనపల్లె రోడ్డులో సోనిపరి గ్రానైట్స్‌వద్ద, కంసలవీధిలోని హరి పాపులర్ షూ కంపెనీ వద్ద చలివేంద్రంలను లాంఛనంగా ప్రారంభించారు. పద్మావతి షుగర్, బీపీ, థైరాయిడ్ క్లినిక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. క్లబ్‌ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలు పిల్లలు, విద్యార్థులలో సేవా స్ఫూర్తిని నింపడం ద్వారా భవిష్యత్తులో సేవా కార్యక్రమాల నిర్వహణకు తోడ్పడతాయన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు చేయడం ఎంతైనా అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, జియంటి కో–ఆర్డినేటర్ హరినాథరెడ్డి, మహమ్మద్, హరీష్‌చంద్ర, ఇందాద్, కిషోర్ కుమార్‌రెడ్డి, అశోక్ రెడ్డి, నారాయణరెడ్డి, మిక్కిలినేని ప్రసాద్‌నాయుడు, వైద్యులు శ్యాంసుందర్‌రెడ్డి, మహేశ్వరరాజు తో పాటు పలువురు క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

**ఉచిత కంటి వైద్య శిబిరం**

**రామాపురం :** మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్ ప్రారంభించారు. అనంతరం బండపల్లె వద్ద వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం శిబిరానికి వచ్చిన ప్రజలకు, వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో దాతలు లయన్ ఆంజనేయరెడ్డి, ప్రసాద్‌నాయుడు, విశ్రాంత ఎస్‌బీఐ అధికారి సుబ్రమణ్యంశెట్టి, మండల నాయకులు అంజనారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు, తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.


# మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ఆదుకోవాలి


మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**రాజంపేట రూరల్ :** రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇ.సికిందర్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగాధర్ రాష్ట్ర కార్యదర్శి కవితతో కలిసి మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు నెలకు రూ.10వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. అర్ధాంతరంగా విధుల నుంచి ఎటువంటి కారాణాలు లేకుండా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని కోరారు. ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం, హెల్త్ కార్డు, గుర్తింపు కార్డు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి 19న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే రాష్ట్ర మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

# బాబు ష్యూరిటీ.. నిరుద్యోగులకు శఠగోపం గ్యారెంటీ!

- ఎన్నికల ముందు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఉదరగొట్టిన చంద్రబాబు
- అధికారంలోకి వచ్చాక విస్మరించిన వైనం
- హామీని నిలబెట్టుకొని ఆదుకోవాలంటూ డిమాండ్




**పుల్లంపేట :** సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసింది. దీంతో నిరుద్యోగులు కూటమి వైపు మొగ్గుచూపారు. ఎన్నికలు అనంతరం నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచింది. హామీలు అమలు చేయకుండా తొమ్మిది నెలలు గడిచినప్పటికీ నిరుద్యోగులకు భృతి ఇచ్చిన పాపానపోలేదు. దీంతో నిరుద్యోగులు లబోదిబోమంటున్నారు.

**ఆందోళనలో నిరుద్యోగులు..**

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో నిరుద్యోగులు సుమారు 16 వేలు నుంచి 20 వేలు వరకు ఉన్నట్టు అధికారుల అంచనా. నియోజకవర్గంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. ఎన్నికల ప్రచారంలో కోడూరు అభివృద్ధికి అటు కూటమి పెద్దలు, నియోజకవర్గ నాయకులు పెద్ద ఎత్తున హామీలు గుప్పించి ఓట్లు వేయించుకున్నారు. తీరా ఎన్నికల్లో గెలిచాక తమకేమీ పట్టనట్టు కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానికంగా ఉద్యోగాలు లేక ఇక్కడి యువత ల్ఫ్ దేశాలకు తరలివెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. అలానే ఉద్యోగ సృష్టి పక్కన పెడితే మంగంపేట మైనింగ్ కార్పొరేషన్ కింద ఉన్న పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది తొలగించి ఉద్యోగాలను పోగొడుతున్నారన్న ఆరోపణలు ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీనే ఇప్పటి వరకు నోచుకోకపోవడంపై డీఎస్సీ ఆశావాహులు పెదవి విరుస్తున్నారు.

**బడ్జెట్ కేటాయింపుల్లో ప్రస్తావనేది**

సూపర్ సిక్స్ పథకాలతో ప్రచారాన్ని నిర్వహించిన కూటమి పక్షాల నాయకులు అమలులో మాత్రం జాప్యం చేస్తుండటంపై నిరుద్యోగులు తీవ్ర అసహనంలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న నిరుద్యోగులకు ఎటువంటి ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడంతో 2014 చంద్రబాబు నాయుడు చేసిన మోసం లాగానే మరోసారి మోసం చేసేందుకు సిద్ధం అవుతున్నారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. నాడు జాబు రావాలంటే .. బాబు రావాలి అని చెప్పి నమ్మించి మోసం చేసిన టీడీపీ ప్రభుత్వం, ఇప్పుడు పేరుమార్చి నిరుద్యోగులను దగా చేశారని ఎద్దేవా చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు తక్షణం భృతి అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


**ఉద్యోగాలు భర్తీ చేయాలి**



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3 వేలు భృతి ఇవ్వాలి. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉద్యోగాలు లేక చదువుకొని నానా అవస్థలు పడుతున్నాం. సూపర్ సిక్స్‌లో పెట్టిన హామీకే బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే మిగతా వాటి అమలు ఎంతవరకు చేయగలరో అనుమానాలు ఉన్నాయి. ప్రభుత్వం అప్పులలో ఉంది.. హామీలు అమలు చేయలేమని చెప్పడం సిగ్గుచేటు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం భృతి చెల్లించాలి.

– కోడూరు సుబ్బరాయుడు, నిరుద్యోగి, రెడ్డిపల్లి, పుల్లంపేట

**ఉద్యోగం కోసం ఎదురుచూపులు**



నేను ఎంబీఏ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఆ హామీ మాలాంటి నిరుద్యోగులకు మంచి చేస్తుందని ఎంతో నమ్మకంతో ఉన్నాం. సీఎం అయ్యాక చంద్రబాబు నాయుడు ఉద్యోగం ఇప్పిస్తారని భావించాం. అంతవరకు నిరుద్యోగ భృతి ఉద్యోగ నోటిఫికేషన్లకు ఫీజు చెల్లించేందుకు ఉపయోగపడుతుందని ఇంట్లో వాళ్లకి ఇబ్బంది ఉండదని భావిస్తే ఇప్పటి వరకు ఆ హామీ గురించి ప్రభుత్వం ఆలోచన కూడా చేయకపోవడం దుర్మార్గం.

– సురేష్, ఎంబీఏ, నిరుద్యోగి, అనంతంపల్లి